# అమర్ ఖయామ్



చిత్రకారుడు: శ్రీ ఎం.కె. సెట్

రోజా పువ్వులు పిల్చెడిన్ మనల కారుణ్యంబు తారుణ్యమున్
తాజా సౌరభముల్ వెలార్చుచు, మనస్తాపంబు చల్లార్చుచున్;
పూజాపుష్పము లట్లు వాడి పడిపోవున్ మేను; లందింపు మా
కూజాలోపలి గోస్తనీరసము తళ్కుల్ గుల్కు కెంగేలితో!

"ఒక్కొకరోజు తక్కువగుచున్నది మీ బ్రతుకం చెరుంగలే
రొక్కొరొకో! యిదేటి కునుకో" యని వెచ్చని హెచ్చరింపుగా
"కొక్కొరొకో" యటం చదిగొ కూయుచునున్నది కోడి పాకపై
కెక్కి; లతాంగి! మేలుకొనవే! కొనవే మధుపూర్ణపాత్రమున్!

చెలువరొ! లెమ్ము! సౌరభముచిమ్ము నవాసన మీయ రమ్ము నీ
కలువకరమ్ముతో; శ్రవణకర్కశ మృత్యుగళంబు నిన్ ననున్
బిలువకముందె; దుర్విధి దభీలున తల్పులు దట్టి చెంగటన్
నిలువకముందె; ముందు గమనింపుము! నింపుము పానపాత్రమున్!

డాక్టర్ కరుణశ్రీ "అమర్ ఖయామ్" పద్యకావ్యం నుంచి

కాలమ్ దాటని కథ

## అందం

"బావా నువ్వా"! అన్నాడు ఆశ్చర్యంగా శ్రీహరి పోలీస్ స్టేషన్లో.

మణి కుమార్ మౌనంగా తల దించుకున్నాడు.

"బావా అసలేం జరిగింది? పోలీసులు నిన్నెందుకు తీసుకువచ్చారు" అడిగాడు శ్రీహరి

"ఆయనేం చెప్తాడు. అసలు సంగతి నన్నడగండి సార్" అన్నాడు కానిస్టేబుల్.

దేనికి మా బావగారిని అరెస్ట్ చేసి లాకప్‌లో వేశారు?"

"మీ బావగారు రంగమ్మ కంపెనీలో-అదుగో రైటరుగారి దగ్గర నిలబడిందే- ఆ అమ్మాయితో వుంటే తీసుకు వచ్చాము" అంటూ పొట్టిగా, నల్లగా వున్న అమ్మాయిని చూపించాడు కానిస్టేబుల్. లాకప్‌లో వున్న మణి కుమార్‌కు ఆకాశం విరిగి మీదపడినట్లు, భూమి లోకి కుంచించుకుపోతున్నట్టు వున్నది.

"మా బావగారిని ఇప్పుడు వదిలిపెట్టరా?" అన్నాడు



శ్రీహరి.

"ఎవరైనా జామీను ఇస్తే వదుల్తాము. రేపు పది గంటలకు కోర్టులో హాజరు కావాలి" అన్నాడు కానిస్టేబుల్.

"శ్రీహరి జామీనుగా వుండి మణికుమార్‌ని విడుదల చేసి ఇంటికి తీసుకువచ్చాడు.

"ఏం బావా! నా చెల్లెలు అందంగా లేదని రెండు సంవత్సరాల నుండి కాపురానికి తీసుకెళ్ళకుండా మా ఇంట్లో వుంచేశావు. పోలీసువారు నీతో కలిపి పట్టుకున్న అమ్మాయి నా చెల్లెలు కంటే అందంగా వుందా?" అన్నాడు శ్రీహరి.

"రెండ్రోజులు పోయాక మణికుమార్ తన చెల్లెలిని కాపురానికి తీసుకుపోతుంటే తృప్తిగా నిట్టూర్చాడు శ్రీహరి.

కానీ మణికి ఎప్పటికీ తెలీని నిజం ఒకటుంది- శ్రీహరే తను రంగమ్మ కంపెనీకి వెళ్ళడం చూచి పోలీసులకు ఫోన్ చేసి అరెస్ట్ చేయించాడని.

—కడలి వెంకటేశ్వరరావు